# రాజ్యానికి మార్గదర్శక నియమావళి

## జనరల్ స్టడీస్


ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

### సంక్షేమ రాజ్య స్థాపనకు ఆదేశిక సూత్రాలు

భారత రాజ్యాంగంలోని నాలుగో విభాగంలో ఆదేశిక సూత్రాల గురించి వివరించారు. సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేయడానికి రాజ్యానికి మార్గదర్శక నియమావళిగా ఇవి ఉపయోగపడతాయి. అదేవిధంగా చట్టసభలు, కార్యనిర్వాహక వర్గానికి చేయాల్సిన చట్టాలు, చేపట్టాల్సిన విధానాలను సూచించేవిగా కూడా భావించవచ్చు. ఇవి ప్రజల హక్కులను నిర్వచిస్తాయి. రాజ్యాంగంలోని తాత్విక చింతనను అర్థం చేసుకోడానికి ఇథోదికంగా దోహదపడతాయి. రాజ్యవ్యవస్థకు ఉండాల్సిన ఆదర్శ విలువలను వివరిస్తాయి. ప్రభుత్వాల పని విధానానికి ప్రామాణికంగా పనిచేస్తాయి. రాజ్య వ్యవస్థ స్వభావాన్ని అంచనా వేసేందుకు ఇవి ప్రాతిపదికలు.

ప్రాథమిక హక్కుల్లా, వీటిని ఉల్లంఘిస్తే న్యాయ వ్యవస్థ ద్వారా పొందడానికి అవకాశం లేదు. అయినప్పటికీ, దేశ పాలనా ప్రక్రియకు వీటిని మౌలికాంశాలుగా పరిగణించాలని రాజ్యాంగంలోని 37వ అధికరణ పేర్కొంటోంది. చట్టాల రూపకల్పనకు ఆదేశిక సూత్రాలను అన్వయించుకోవాలని రాజ్యాంగం చెబుతోంది. అందుకే భారత రాజ్యాంగంలోని సంక్షేమ రాజ్య భావనకు గీటురాళ్లు ఈ సూత్రాలు. 'పౌరుల సంక్షేమానికి కృషి చేయడం ప్రభుత్వ బాధ్యత' అని ఆదేశిక సూత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక న్యాయాన్ని అందివ్వాలని భారత రాజ్యాంగ పీఠికలోనే ఉంది. పీఠికను రాజ్యాంగ మౌలిక స్వరూపంగా భావించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ఎలా ఇవ్వాలనే విషయం ఆదేశిక సూత్రాలను చదివితే అర్థమవుతుంది. అందుకే చట్టాల రూపకల్పనలో వీటిని పరిగణనలోకి తీసుకోవడం రాజ్య వ్యవస్థ బాధ్యత అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 37 పేర్కొంటోంది.

### మానవ హక్కులుగా ఆదేశిక సూత్రాలు

'అభివృద్ధి కోసం హక్కు- విడదీయరాని మానవ హక్కు'గా ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యానించింది. రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విఘాతం కలిగించకుండా పార్లమెంటు ఆదేశిక సూత్రాల అమలుకనుగుణంగా ప్రాథమిక హక్కులను సవరించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆదేశిక సూత్రాలను మానవ హక్కులుగా కూడా భావించవచ్చని రాజనీతి శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ప్రాథమిక హక్కులనే కాదు మొత్తం రాజ్యాంగ నిబంధనలను కూడా ఆదేశిక సూత్రాలను పరిగణలోకి తీసుకుంటూ అన్వయించుకోవాలి. సాధ్యమైనంత మేరకు ఆదేశిక సూత్రాల అమలుకు వీలుకలిపించేందుకు చేసే చట్టాలను ఆమోదించాలని సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన తీర్పుల సందర్భంగా పేర్కొంది. 'రాజ్యంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలను సమతుల్యతతో చదవాలి, అన్వయించాలి' అని 1991లో గృహ కళ్యాణ్ కేంద్ర వర్కర్స్ యూనియన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయితే ఆదేశిక సూత్రాలు అమలు కానప్పుడు చట్టాల ఉల్లంఘన జరిగినట్లు భావించలేం.

ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించే సామాజిక వ్యవస్థను రాజ్యం సాధించాలి, పరిరక్షించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 38 పేర్కొంటోంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని సాధించే రీతిలో సామాజిక వ్యవస్థ ఉండాలి. జాతీయ జీవనంలోని అన్ని అంగాలు ఈ న్యాయాన్ని గుర్తెరిగి వ్యవహరించాలని అధికరణ వివరిస్తోంది. ఆదాయ అసమానతలను సాధ్యమైనంతగా తగ్గించేందుకు రాజ్యం ప్రయత్నించాలి. ప్రభుత్వం పౌరులకు సదుపాయాలు, అవకాశాలు, స్థితిగతులను కల్పించడంలో వ్యక్తులు, వివిధ వర్గాల ప్రజలు, ప్రాంతాలు, వివిధ వృత్తులు చేసుకునే వారి మధ్య అసమానతలను పూర్తిగా తొలగించేందుకు ఆదేశిక సూత్రాలు దేశ ప్రజలకు హామీ ఇస్తున్నాయి.

రాజ్య వ్యవస్థ విధానాల రూపకల్పన సమయంలో అనుసరించాల్సిన కొన్ని మార్గదర్శక నియమాలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 వివరిస్తోంది. కింది లక్ష్యాలను సాధించే దిశగా రాజ్య విధానాలు ఉండాలి.

- ★ స్త్రీ, పురుష భేదం లేకుండా పౌరులందరికీ సరిపడా జీవనోపాధి లభించాలి.
- ★ ప్రజలందరి సంక్షేమానికి ఉపయోగపడే విధంగా భౌతిక వనరుల పంపిణీ జరిగేందుకు, వనరుల యాజమాన్యం, నిర్వహణ ఉండాలి.
- ★ జన బాహుళ్యం అందరి ప్రయోజనాలకు విఘాతం కలిగించే రీతిలో సంపద, ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణకు ఆర్థిక వ్యవస్థ నిర్వహణ వీలు కల్పించకూడదు.
- ★ స్త్రీ, పురుషులెవరికైనా సమాన పనికి సమాన వేతనం అనే సూత్రం అమలు జరగాలి.
- ★ శ్రామికుల ఆరోగ్యానికి హాని కలగకూడదు. పిల్లల చిరుప్రాయాన్ని కొల్లగొట్టకూడదు. ఆర్థిక కారణాలతో ఏ పౌరుడూ తన వయసు, శక్తికి మించిన పనులు చేయకుండా చూడాలి.
- ★ పిల్లలందరూ ఆరోగ్యంగా, స్వేచ్ఛగా, గౌరవ ప్రదంగా అభివృద్ధి చెందేవిధంగా, అవసరమైన సదుపాయాలు, అవకాశాలను కల్పించాలి. బాల్యం, యవ్వనం దోపిడీకి గురి కాకుండా రక్షణ కల్పించాలి. నైతికంగా, భౌతికంగా పిల్లలు, యువత నిర్లక్ష్యానికి గురికాకుండా చూడాలి.

### పౌర హక్కుల పరిరక్షణకు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అవసరమైన చర్యలను తీసుకోవాలని రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 39(ఇ), 39(ఎఫ్), 41, 47 సూచిస్తున్నాయి. 'ఏదైనా ఫ్యాక్టరీ, గని లేదా ఇతర ప్రమాదకర పనుల్లో ఉన్న బాల కార్మికుల స్థానంలో వాళ్ల తల్లిదండ్రులకు ఎక్కడైనా ఉపాధి కల్పించాలి' అని 1997లో ఎం.సి. మెహతా వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల స్ఫూర్తితోనే అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాలకు ఈ సూచన చేసింది.

రాజ్యాంగంలోని 40వ అధికరణ గ్రామ పంచాయతీల నిర్వహణ గురించి చెబుతోంది. గ్రామ పంచాయతీలను ఏర్పాటుచేసి, వాటిని స్వపరిపాలనా యూనిట్లుగా పనిచేసేందుకు అవసరమైన అధికారాలను ఇచ్చేందుకు రాజ్య వ్యవస్థ చర్యలు తీసుకోవాలని ఈ అధికరణ పేర్కొంటోంది.




ఉపాధి, విద్య, కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాల నుంచి సహాయాన్ని పొందడానికి పౌరులకు ఉండే హక్కుల గురించి రాజ్యాంగంలోని 41వ అధికరణ ప్రస్తావిస్తోంది. ఆర్థిక సామర్థ్యం, అభివృద్ధి దశను బట్టి రాజ్య వ్యవస్థ పౌరులందరికీ ఉపాధి, విద్యా సంబంధ హక్కులను కల్పించడానికి ప్రయత్నించాలి. నిరుద్యోగులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్లు, వృద్ధులకు ప్రభుత్వం సాయాన్ని అందించేందుకు కృషి చేయాలని ఈ అధికరణ పేర్కొంటోంది. రాజ్యాంగంలోని 41వ అధికరణను అమలు చేసేందుకు దోహదం చేసేవిధంగా చట్టాలను కోర్టుకు అన్వయించాలని 1991లో సుప్రీంకోర్టు జాకబ్ వర్సెస్ కేరళ వాటర్ అథారిటీ కేసులో తీర్పు చెప్పింది.

శ్రామికులకు న్యాయమైన, మానవీయమైన పని పరిస్థితులు ఉండాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో భాగంగా ఆర్టికల్ 42 పేర్కొంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత లేదా, సహకార ప్రాతిపదికపై కుటీర పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని 43వ అధికరణ చెబుతోంది. అదేవిధంగా వ్యవసాయం, పరిశ్రమలు, వివిధ రంగాలకు చెందిన కార్మికులకు మెరుగైన పని పరిస్థితులను కల్పించే విషయాన్ని కూడా ఇదే అధికరణ పేర్కొంటోంది. చట్టపరంగాగానీ, ఆర్థిక నిర్వహణ రీత్యాగానీ లేదా ఇతర పద్ధతిలోగానీ కార్మికులందరూ జీవించేందుకు అవసరమైన వేతనం పొందేవిధంగా చూడాల్సిన బాధ్యత రాజ్యానికి ఉంది. మెరుగైన పని పరిస్థితులు, జీవన స్థితిగతులు, సామాజిక, సాంస్కృతిక అవకాశాలు, విశ్రాంతిని పొందేందుకు వీలు కల్పించాలని రాజ్యాంగంలోని 43వ అధికరణ వివరిస్తోంది. పరిశ్రమల యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యాన్ని కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆర్టికల్ 43ఏ చెబుతోంది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 ఉమ్మడి పౌర స్మృతిని ప్రస్తావిస్తోంది. పౌరులందరికీ దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌర స్మృతి లభించేలా రాజ్యం చర్యలు తీసుకోవాలి. ప్రజలందరికీ ఒకే విధమైన చట్టం ఉండాలని ఆశించడం సరైందే. అయితే దీన్ని ఒకే సారి చట్టం ద్వారా సాధించేందుకు ప్రయత్నించడం వల్ల దేశ సమైక్యతకు నష్టం కలిగే అవకాశం ఉందని 1996లో సుప్రీంకోర్టు పన్నాలాల్ బన్సీలాల్ పాటిల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో తీర్పు చెప్పింది.

### ఉచిత నిర్బంధ విద్య

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 45, ఆరేళ్ల లోపు పిల్లలందరికీ బాల్య సంరక్షణ, పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు రాజ్యవ్యవస్థ కృషి చేస్తుందని పేర్కొంది. ఇంతకు ముందు ఈ అధికరణలో నిర్బంధోచిత ప్రాథమిక విద్య గురించే ఉండేది. రాజ్యాంగ సవరణ ద్వారా విద్యను ప్రాథమిక హక్కుగా మార్చడంతో ప్రస్తుతం ఈ అధికరణ ఆరేళ్లలోపు పిల్లల గురించి ప్రస్తావిస్తోంది. రాజ్య వ్యవస్థ ప్రత్యేక శ్రద్ధతో బలహీనవర్గాలవారికి విద్య, ఆర్థికపరమైన ప్రయోజనాలను ప్రోత్సహిస్తుందని 46వ అధికరణ పేర్కొంటోంది. ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారి ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రత్యేకంగా కృషి చేయాలని కూడా ఈ అధికరణ వివరిస్తోంది. సామాజిక అన్యాయంతోపాటు అన్ని రకాల దోపిడీల నుంచి వీరికి రక్షణ కల్పించాలి. ఈ అధికకరణ నేపథ్యంలోనే గిరిజనులకు అనేక ప్రత్యేక చట్టాలు వచ్చాయి. అందుకే గిరిజనుల భూమి గిరిజనేతరులకు అన్యాక్రాంతం కావడాన్ని నిరోధించేందుకు చేసే చట్టాలు చెల్లుతాయని సుప్రీంకోర్టు 1985లోనే లింగప్ప వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో తీర్పు చెప్పింది. సమాజంలోని బలహీన వర్గాలు అనే భావనకు అవసరమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించాలని అత్యున్నత న్యాయస్థానం మరో కేసు సందర్భంగా తీర్పు చెబుతూ కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం, ప్రజల పౌష్టికాహార స్థాయిని, జీవన ప్రమాణాలను పెంపొందించడం ప్రభుత్వ బాధ్యత అని రాజ్యాంగంలోని 47వ అధికరణ చెబుతోంది. మద్యపానం, మత్తు పదార్థాల వినిమయాన్ని నిషేధించేందుకు రాజ్యం కృషిచేయాలి. ప్రజారోగ్యం, పౌష్టికాహారం, జీవన పరిస్థితులను మెరుగుపరచడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది. కానీ, ప్రణాళికా సంఘం లెక్కల ప్రకారమే దేశంలో ఆరేళ్లలోపు పిల్లల్లో 40 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. 45 శాతానికిపైగా పిల్లలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో టీకాలు ఇవ్వలేదు. 43 శాతం పిల్లలు ఎనిమిదో తరగతి పూర్తయ్యేలోగా బడి మానేస్తున్నారు. 41 శాతం తల్లులకు శిక్షణ పొందినవాళ్ల ద్వారా మాతృత్వ సేవలు అందుబాటులో లేవు. దురదృష్టవశాత్తు రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ప్రభుత్వాలకు కేవలం సూచనలు మాత్రమే. న్యాయస్థానంలో సవాల్ చేసి సాధించే వీలు లేదు కాబట్టి రాజ్యాంగస్ఫూర్తికి భిన్నంగా పాలనా ప్రక్రియ సాగుతోంది. ఆదేశిక సూత్రాలు పాలనా ప్రక్రియలో మౌలికమైనవని రాజ్యాంగం చెప్పినా ఆశించిన ఫలితం లేదు.

వ్యవసాయం, పశుపోషణను ఆధునిక, శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించేందుకు రాజ్యం అన్ని చర్యలూ తీసుకోవాలని ఆర్టికల్ 48 వివరిస్తోంది. అయినప్పటికీ వ్యవసాయం సంక్షోభంలో ఉందంటే ఆదేశిక సూత్రాలు విఫలమైనట్లే.

కళాత్మక, చారిత్రాత్మక ప్రాధాన్యమున్న కట్టడాలు, ప్రదేశాలు, వస్తువులను పరిరక్షించే బాధ్యత రాజ్యానిదని ఆర్టికల్ 49 పేర్కొంటోంది. కార్యనిర్వాహక వర్గం నుంచి న్యాయ వ్యవస్థను వేరు చేయాలని ఆర్టికల్ 50 చెబుతోంది. విదేశీ వ్యవహారాలు, అంతర్జాతీయ సంబంధాల కోసం దేశం అనుసరించాల్సిన విధానాల గురించి రాజ్యాంగంలోని 51వ అధికరణ వివరిస్తోంది. ఈ అధికరణ ప్రకారం రాజ్యం కింది లక్ష్యాల కోసం కృషి చేస్తుంది.

1. అంతర్జాతీయంగా శాంతి, సుస్థిరతలను పెంపొందించడం
2. వివిధ దేశాల మధ్య న్యాయమైన, గౌరవప్రదమైన సంబంధాలు ఉండటం
3. అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలను గౌరవించడం
4. న్యాయమైన పద్ధతిలో అంతర్జాతీయ వివాదాలను పరిష్కరించుకోవడాన్ని ప్రోత్సహించడం.

అభివృద్ధికి సరైన నిర్వచనాన్నివ్వడానికి, పాలనలో లక్ష్యాలను విశ్లేషించడానికి రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను ప్రాతిపదికగా తీసుకోవాలి. ఉదాత్త లక్ష్యాలను నిర్దేశించుకోగానే సరిపోదు. వాటి అమలుకు చిత్తశుద్ధితో కృషిచేయాలి.

(రచయిత జర్నలిజం అధ్యాపకులు, కాలమిస్టు)